# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 19-09-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. రాష్ట్రంలో 75 అన్నా క్యాంటీన్‌లను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈరోజు ప్రారంభిస్తారు.**

**2. రాష్ట్రంలో ఆధ్యాత్మిక పర్యాటకాన్ని మరింత అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేశ్ పేర్కొన్నారు.**

**3. పీజీ వైద్య విద్యలో ప్రవేశాలకు సంబంధించి సీట్ల సంఖ్య తగ్గిస్తూ జారీ చేసిన జీఓను సవరించనున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు.**

**4. కేంద్ర ప్రభుత్వం కిసాన్ సమ్మాన్ నిధి కింద రైతులకు పెట్టుబడి సాయం అందిస్తోందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు డి.పురందేశ్వరి చెప్పారు.**

**5. వరద బాధితులకు లబ్ధి చేకూర్చేలా రుణాల రీషెడ్యూలింగ్ అవకాశం కల్పించేందుకు బ్యాంకులు ముందుకొచ్చాయని ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి జె.నివాస్ తెలిపారు.**

=============================

రాష్ట్రంలో 75 అన్నా క్యాంటీన్‌లను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ప్రారంభిస్తారు. వీటిలో విశాఖపట్నం మహా నగర పాలక సంస్థ పరిధిలో ప్రభుత్వం 25 క్యాంటీన్ లను ప్రారంభిస్తోంది. మొత్తంగా 203 కేంద్రాలను ప్రారంభించాలనే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోగా తొలి విడతలో 100 క్యాంటీన్‌లను ప్రభుత్వం ప్రారంభించింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులో ఉన్న 100 అన్నా క్యాంటీన్‌లలో ఐదు రూపాయలకు ఉదయం పూట అల్పాహారం, అదేవిధంగా మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం కూడా ఐదు రూపాయలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది.

-------------------------

రాష్ట్రంలో ఆధ్యాత్మిక పర్యాటకాన్ని మరింత అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఈ రోజు నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆలయాల పర్యాటక అభివృద్ధికి పెట్టుబడులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. తిరుపతి, గండికోటలో పెట్టుబడులకు ఒబెరాయ్ సంస్థను ఆహ్వానించామన్నారు. ఆధ్యాత్మిక కేంద్రాల్లో అన్ని వసతులు ఉండేలా ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల వద్ద భక్తులకు వసతి గృహాలను నిర్మిస్తామని అన్నారు. శ్రీశైలంలో పర్యావరణ హిత పర్యాటక అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని, అరకు, లంబసింగిని

బొర్రా గుహలను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ ( 35 సెకన్లు)

--------------------------

రాష్ట్రంలో పీజీ వైద్య విద్యలో ప్రవేశించేందుకు ఇన్ సర్వీసెస్ కోటాలో సీట్ల సంఖ్య తగ్గిస్తూ జారీ చేసిన జీఓ 85ను సవరించనున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు- పీహెచ్‌సీల్లో వైద్యుల సంఘానికి చెందిన 15 మంది ప్రతినిధులతో మంత్రి సత్యకుమార్ చర్చించారు. ఈ జీఓ ద్వారా ప్రకటించిన ఆరు ప్రత్యేక విభాగ బ్రాంచుల్లోనే కాకుండా అన్ని కోర్సుల్లోనూ ప్రవేశాలు కల్పించనున్నామన్నారు. ఈ మేరకు వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఒక ప్రకటన జారీ చేసింది.

--------------------------

కేంద్ర ప్రభుత్వం కిసాన్ సమ్మాన్ నిధి కింద రైతులకు పెట్టుబడి సాయం అందిస్తోందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు డి. పురందేశ్వరి తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఈరోజు ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జాబితా ప్రకారం మూడు విడతలుగా 6 వేల రూపాయలను కేంద్రప్రభుత్వం ఇస్తోందని చెప్పారు. రైతులకు లబ్ధి చేకూర్చే విధంగా కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధరలను పెంచిందని చెప్పారు. బీజేపీ వంద రోజుల పాలనలో మధ్యతరగతి ప్రజలపై ప్రత్యేక దృష్టి సారించిందని మౌలిక సదుపాయాల కోసం 3 లక్షల కోట్ల రూపాయలను ఖర్చు చేసిందని అన్నారు. రాష్ట్రానికి 8 కొత్త రైల్వేలైన్ ప్రాజెక్టులను మంజూరు చేసిందని పురందేశ్వరి పేర్కొన్నారు.

--------------------------

రాష్ట్రంలో బి – ఫార్మసీ కోర్సుల్లో పార్శ్వ ప్రవేశాలు- లేటరల్ ఎంట్రీలకు సంబంధించి ఎపి ఈసెట్ – ఫార్మసీ కౌన్సెలింగ్ ను రేపటి నుంచి ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ గణేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రేపు, ఎల్లుండి ప్రవేశాలకు సంబంధించిన నమోదు, వెబ్ ఐచ్ఛికాల ఎంపిక చేసుకోవచ్చని పేర్కొన్నారు. అలాగే 23వ తేదీన ఐచ్ఛికాలను మార్పు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 25వ తేదీన ప్రవేశాలను కేటాయిస్తున్నట్లు వివరించారు. వివరాలకు సంబంధిత వెబ్‌సైట్ ఎచ్ఎం. ఖజూంఎప్త్రవ.ఖజూ.స్త్రశీజ.ఱఅ చూడాలని తెలిపారు.

--------------------------

గ్రామాలు పరిశుభ్రంగా రూపుదిద్దుకునేందుకు ప్రతి ఒక్కరు స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి కోరారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా రాజమహేంద్రవరంలో నిర్వహించిన స్వచ్ఛత హి సేవ ర్యాలీని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామపంచాయతీలు, నగరపాలక సంస్థల్లో పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అక్టోబర్ 2 వరకు నిర్వహించే ఈ కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

--------------------------

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ఎన్‌పిఎస్ వాత్సల్య పథకంను ప్రారంభించగా ఆ కార్యక్రమాన్ని అనంతపురం జిల్లా పరిషత్ కార్యాలయంలో లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లాకు చెందిన విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు దృశ్య మాధ్యమం ద్వారా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాబార్డ్ జిల్లా అభివృద్ధి అధికారి–డిడిఎం కె.అనురాధ మాట్లాడుతూ చిన్నపిల్లల తల్లిదండ్రులు ఈ పథకంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ పథకం క్రింద నమోదు చేసుకోవడానికి ప్రజలు దగ్గరలో ఉన్న బ్యాంకులను సంప్రదించాలని తెలిపారు.

---------------------------

వరద ప్రభావిత ప్రాంత ప్రజలకు లబ్ధి చేకూర్చేందుకు రుణాల రీషెడ్యూలింగ్ అవకాశం కల్పించేందుకు బ్యాంకులు ముందుకొచ్చాయని ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి జె.నివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు సంబంధిత బ్యాంకు బ్రాంచ్లను సంప్రదించి లబ్ధిపొందాలని ఆయన తెలిపారు. రుణాల చెల్లింపునకు సంబంధించి బ్యాంకులు ఏడాది పాటు మారటోరియం అవకాశం కల్పించాయన్నారు. పంట రుణాలు, ఆటో రిక్షా, ద్విచక్రవాహనాల రుణాలు, వాణిజ్య సంస్థలు, కిరాణా షాపులు, హెూటళ్లు, ఇతర చిన్న పరిశ్రమలకు ఈ మారటోరియం వర్తిస్తుందన్నారు. విజయవాడలోని 179 సచివాలయాల పరిధిలోని క్రింది అంతస్తుల కుటుంబాలకు 50 వేలు, మొదటి, ఆపై అంతస్తులో ఉన్న వారు 25 వేల వరకు వినియోగ రుణాలు పొందవచ్చన్నారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఆవాస్ యోజనా పథకం క్రింద చిత్తూరు జిల్లాకు మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఈరోజు చిత్తూరుజిల్లా కలెక్టర్ కార్యాలయంలో దృశ్య మాధ్యమం ద్వారా జిల్లా కలెక్టర్ ప్రధాన మంత్రి ఆవాస్ యోజనా పథకం అమలుపై సంబంధిత అధికారులతో కలసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు ఉపాది హామీ పథకం కింద 90 రోజులు పని దినాలను కేటాయించామని తెలిపారు. తద్వారా నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పేర్కొన్నారు.

---------------------------

విజయవాడ నగరంలో సంభవించిన భారీ వర్షాలు, వరదలను కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. విజయవాడలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆయన పర్యటించి. పాత రాజరాజేశ్వరిపేటలో వరద బాధితులకు చీరలు, దుప్పట్లలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం బుడమేరును త్వరితగతిన ఆధునీకరించాలని కోరారు. వరద బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సాయం పెంచాలని.. వరదల కారణంగా నష్టపోయిన విద్యార్థులకు ప్రత్యేకంగా సాయం అందించాలని కోరారు.

---------------------------

శ్రీకాకుళం జిల్లాలో ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. జిల్లాలో కవిటి మండలం రాజపురం గ్రామంలో ముఖ్యమంత్రి పర్యటించనున్న ప్రాంతాలను జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి కలెక్టర్ ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడి వందరోజుల పూర్తయిన సందర్భంగా

“ఇది మన ప్రభుత్వం “ పేరిట కవిటి మండలంలో నిర్వహించే రచ్చబండ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటారని తెలిపారు. అలాగే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారితో సంభాషిస్తారని చెప్పారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబందించిన హెలిపాడ్, రూట్ మ్యాప్, రాజపురంలో గ్రామసభ నిర్వహించే రచ్చబండ వేదిక వంటి ఏర్పాట్లను పూర్తి చేశామని తెలిపారు.

---------------------------

తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భక్తుల సౌకర్యార్థం వృద్ధులు, దివ్యాంగులు, చిన్నపిల్లల తల్లిదండ్రులు సహా అన్ని ప్రత్యేక దర్శనాలు, ఆర్జిత సేవలు రద్దు చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం–టిటిడి అదనపు కార్యనిర్వహణాధికారి సీహెచ్ వెంకయ్యచౌదరి తెలిపారు. అక్టోబరు 8న జరిగే గరుడసేవ కోసం వివిధ శాఖల ఉన్నతాధికారులతో స్థానిక గోకులం అతిథిగృహంలో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. గరుడ సేవను పురస్కరించుకొని అక్టోబర్ 7వ తేదీ రాత్రి 9 గంటల నుంచి అక్టోబర్ 9న ఉదయం 6 గంటల వరకు రెండు ఘాట్‌రోడ్లలో ద్విచక్రవాహనాల రాకపోకలు నిషేధించినట్లు తెలిపారు.

======================